క్లుప్తంగా

పలువురికి 'ఫ్యాబ్' సాయం



బాల్య మిత్రుడికి నగదు అందిస్తున్న ఫ్యాబ్ సభ్యులు

భీమునిపట్నం: ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) సభ్యుడు ఎస్.జగన్నాథరావు జయంతి సందర్భంగా శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీచ్ వద్ద రాగి జావ అమ్ముతున్న చిరు వ్యాపారికి 20 లీటర్ల స్టీల్ హాట్ బాక్స్ అందించారు. ఫ్యాబ్ సభ్యుల బాల్య మిత్రుడు వెంకటపతి రాజు పిల్లల ఫీజు కోసం రూ.10 వేలు, గెడ్డ వీధి రామాలయం అర్చకులు అగ్నిహోత్రం రమేష్ కుమార్తె వివాహం కోసం రూ.10 వేలు అందించారు. ఫ్యాబ్ ప్రతినిధులు కాళ్ల సన్నీ, ముసునూరి సూర్య శ్రీనివాస్, ఉసిరికల రాజు, మారోజు గోపి, పి.దేవానంద్, విజ్జపు సత్యనారాయణ, గుగ్గిళ్ల సాయి, కందివలస నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

దేశ ప్రగతికి నూతన ఆవిష్కరణలు కీలకం

కొమ్మాది: పారిశ్రామిక రంగం నుంచి అంతరిక్షంలోకి నూతన ఆవిష్కరణల ఆవశ్యకత ఎంతో ఉందని దేశ ప్రగతికి నూతన సాంకేతిక పరిజ్ఞానం కీలకమని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. గీతంలో నిర్వహిస్తున్న యూత్ కాన్క్లేవ్ – 2023 ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాచార సాంకేతిక రంగం, కమ్యూనికేషన్ వ్యవస్థలు, శక్తివనరుల రంగంలో వస్తున్న మార్పులను యువత అర్థం చేసుకోవాలని సూచించారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తొట్లకొండ ఎదురుగా గల తీరానికి శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ భరత్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతునికి 50 సంవత్సరాల వయసు వుంటుందని, సంబంధీకులు సంప్రదించాలని కోరారు.

నిరాశ్రయులకు భోజనం పంపిణీ



భోజనం ప్యాకెట్లు అందిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: స్థానిక టీచర్స్ హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యంలో వంద మంది నిరాశ్రయులకు శనివారం భోజనం ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మరగడ రామకృష్ణ మాట్లాడుతూ తాము పేదలకు సాయం అందిస్తున్నామన్నారు. గ్రంధి శ్యాం సుందర్ సహకారంతో పేదలకు దుప్పట్లు అందించామని తెలిపారు. సభ్యులు కంటుబోతు ముత్యాలరావు, పత్రి సన్యాసిరావు, నయిం అన్సారి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు



పద్మనాభంలో బూత్ లెవల్ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ పరిశీలించారు. కృష్ణాపురం, పద్మనాభం, గంధవరం గ్రామాలను ఆయన సందర్శించారు. స్థానిక బూత్ లెవల్ సిబ్బందితో మాట్లాడారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు.

రాష్ట్రంలో అవినీతి రహిత పాలన



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం : ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బి.ఆర్.తాళ్లవలస, బొత్సపేటలో శనివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు. తమ పార్టీ కాని వారికి కూడా సంక్షేమ పథకాలు అందించి పెద్ద మనసు చాటుకున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా అవినీతి లేకుండా పరిపాలన సాగిస్తున్నామన్నారు. ఈనాం రైతులకు రైతు భరోసా అందిస్తున్నట్టు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరగకుండా గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా అధికారులను ప్రజల వద్దకు తీసుకొచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నట్టు తెలిపారు.

బి.ఆర్.తాళ్లవలస సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు రూ.28 కోట్లు అందించామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. బొత్సపేటలో రూ.4 లక్షలతో నిర్మించిన సామాజిక వేదికను ప్రారంభించారు. బొత్సపేటలో డ్రైనేజీలు నిర్మించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరగా పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కల్యాణపు మంగారావు, పిన్నింటి సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



మందులు అందజేస్తున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి

కొమ్మాది: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఆర్‌డీవో భాస్కరరెడ్డి అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారన్నారు. 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కార్పొరేటర్ లొడగల అప్పారావు తెలిపారు. ఆరోగ్య శ్రీపై కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ

పద్మనాభం: మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన ఇద్దరు బాధితులకు జనసేన పార్టీ భీమునిపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐనాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ కలయిక నేడు

తగరపువలస: భీమిలి బ్యాంకు కాలనీ కుంచమాంబ ఆలయం వద్ద ఆదివారం అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ కలయిక జరగనుంది. ఈ సామాజిక వర్గానికి చెందిన వారంతా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

బాలికా విద్యకు నాందీ ఫౌండేషన్ చేయూత



విద్యార్థులతో భీమిలి ఎంఈవో - 1 శివరాణి


తగరపువలస: బాలికా విద్యా ప్రోత్సాహానికి నాందీ ఫౌండేషన్ చేయూత ఇస్తోందని భీమిలి ఎంఈవో – 1 శివరాణి అన్నారు. శనివారం పాఠశాలలో 60 మంది విద్యార్థినులకు నాందీ ఫౌండేషన్ సమకూర్చిన స్టేషనరీతో కూడిన బ్యాగులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫౌండేషన్ అందించిన బ్యాగులు, స్టేషనరీ విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నాందీ వలంటీర్లను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు బుగత మల్లిక, నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట దుర్గాలమ్మ ఆలయం వద్ద శనివారం స్వాములకు నిత్యాన్నదానం ప్రారంభించారు. శ్రీదుర్గాలమ్మ తల్లి అయ్యప్ప సేవా పీఠం ఆధ్వర్యంలో డిసెంబర్ 14 వరకు 41 రోజులపాటు రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 వరకు అన్నసంతర్పణ జరుగుతుంది. అయ్యప్ప స్వాములతోపాటు ఇతర దీక్షల మాలధారులకూ అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నట్లు సేవాపీఠం ప్రతినిధులు తెలిపారు.

వసతులు లేక అవస్థలు

- ఎర్రయ్యపాలెం జెట్టీ సందర్శనకు వందలాది మంది పర్యాటకులు
- కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు



తీరంలో జెట్టీకి చేరుకునేందుకు కాలిబాటలు



అన్నవరం తీరంలో సముద్రంపై నిర్మించిన జెట్టీ

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం తీరంలో జెట్టీ వద్ద వసతులు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు. ఇక్కడి సముద్రంపై నిర్మించిన జెట్టీ పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తోంది. నిత్యం దూర ప్రాంతాల నుంచి వందలాది మంది ఇక్కడకు చేరుకుని జెట్టీ అందాలను ఆస్వాదిస్తుంటారు. ఇక కార్తీక మాసంలో పర్యాటకుల తాకిడి వేల సంఖ్యలో ఉంటుంది. కానీ జెట్టీ చుట్టుపక్కల 2 కిలోమీటర్ల వరకు కనీస వసతులు లేవు. పర్యాటకులు తాగునీరు కావాలన్నా పంచాయతీలో ఎర్రయ్యపాలెం లేదా కొత్తపేట వచ్చి కొనుక్కోవాల్సిందే. ఇక జెట్టీకి చేరుకోవడానికి సరైన రహదారులు, అక్కడ సేద తీరడానికి బెంచీలు, వాష్‌రూమ్‌లు లేవు. దీంతో ఇక్కడకు వచ్చే పర్యాటకులు ఇసుకపై కూర్చోవడం లేదా చుట్టుపక్కల తోటలను ఆశ్రయిస్తున్నారు. తీరంలోనే పర్యాటకులు మలమూత్ర విసర్జన చేస్తుండటంతో అక్కడి వాతావరణం జుగుప్సాకరంగా తయారైంది. ఇక్కడకు వచ్చే పర్యాటకులు తాగునీరు, టాయిలెట్లు, కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తీరంలో విచ్చలవిడిగా మందుబాబులు ఖాళీ సీసాలను కూడా పడేస్తుండడంతో కట్టడి చేయాలంటున్నారు. ఇక్కడికి సమీపంలో మరో పర్యాటక ప్రాంతమైన పాండవుల పంచ కూడా ఉన్నందున రెండింటికీ వచ్చే పర్యాటకులను ఆకర్షించడానికి వసతులు కల్పించాలని కోరుతున్నారు.

పంచాయతీ చొరవతో ప్రయోజనం

అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం తీరంలో జెట్టీ వద్దకు చేరుకోవడానికి పర్యాటకులకు కనీస సౌకర్యాలు లేవు. ఎర్రయ్యపాలెం ఆర్ అండ్ బీ రహదారి నుంచి మట్టి రహదారిలో 2 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ మార్గానికి ఇరువైపులా దివీస్ పైప్‌లైన్లు, కాంట్రాక్ట్ లేబర్‌కు చెందిన అద్దె ఇళ్లు ఉండడంతో పర్యాటకులు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. అంతేకాకుండా జెట్టీకి చేరుకునే మార్గంలో కాలిబాటలు, ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో అభద్రతా భావానికి లోనవుతున్నారు. ఇప్పటికైనా అన్నవరం పంచాయతీ పాలకవర్గం స్పందించి జెట్టీకి చేరుకునే మార్గంలో టోల్‌గేట్ ఏర్పాటు చేసి కనీస రుసుం వసూలు చేయడం ద్వారా వచ్చే ఆదాయంతో వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఎర్రయ్యపాలెం జెట్టీ వద్ద పర్యాటకులు సేద తీరడానికి చెట్లు, పార్కులు, బెంచీలు ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



జెట్టీకి వెళ్లే మార్గానికి ఇరువైపులా తుప్పలు

గాయత్రీ మంత్ర జప యజ్ఞంతో సనాతన ధర్మ వ్యాప్తి



మంత్ర జప యజ్ఞం నిర్వహిస్తున్న సంధ్యోపాసకులు

దాబాగార్డెన్స్ : లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ కల్వకొలను చిత్తరంజన్‌దాస్ స్మారక సేవా సంస్థ ఆధ్వర్యంలో శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞం నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. దీనిలో భాగంగానే శనివారం మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణ వేదికగా సామూహిక గాయత్రీ మంత్ర హవనం, పూర్ణాహుతి నిర్వహించినట్టు చెప్పారు. శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞంలో 3 వేల మంది నిత్యం సంధ్యోపాసకులు జపం చేస్తున్నారని, దేవీ భాగవత అనుసారంగా జరుగుతున్న శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞానికి పంచాహ్నిక దీక్ష, సహస్రాధిక రుత్వికులు చతుర్వింశాత్మక కుండ హవనం, మండపారాధనలు, దీక్షాధారణలు, సీతా రామకల్యాణ మహోత్సవం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం, సాధూ సమ్మేళనం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు గత నెల 27 నుంచి 31 వరకు ఉత్తరప్రదేశ్ అయోధ్యపురిలో వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. చిత్తరంజన్‌దాస్ స్మారక సేవా సంస్థ నేతృత్వంలో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సనాతన ధర్మ వ్యాప్తికి విశేష కృషి చేస్తూ అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ సోమరాజు రఘునాథ్, ప్రిన్సిపల్ కో ఆర్డినేటర్లు మిర్తిపాటి వెంకటరామయ్య, ఖండవల్లి సీతారాం, రామకృష్ణ, కేసీడీటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాలకు ఏసీ బహూకరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాల ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం విద్యార్థి దాసరి పృథ్వీరెడ్డి నూతన ఏసీ బహూకరించారు. ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మిని శనివారం కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏయూ న్యాయ కళాశాల ఎందరో న్యాయ కోవిదులను, రాజకీయ నాయకులను దేశానికి అందించిందన్నారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధిని కాంక్షిస్తూ పనిచేయడం సంతోషకరమన్నారు.

విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో రక్షణ



మాట్లాడుతున్న సీఐ ఇమ్మానుయేల్ రాజు

సీతమ్మధార: ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్ పరిధి సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని హిల్‌వ్యూ పార్కులో శనివారం పార్కు అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై సీఐ టి.ఇమ్మానుయేల్ రాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నిఘా కెమెరాల ఏర్పాటు ద్వారా ఇళ్లు, కార్యాలయాలకు రక్షణతోపాటు గతంలో జరిగిన దొంగతనాలను సులువుగా ఛేదించవచ్చని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. నగదు, బంగారు ఆభరణాలును బ్యాంక్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. ఊళ్లు, దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తాళాలు జాగ్రత్త పరచాలన్నారు. అపార్ట్‌మెంట్లలో రిజిస్టర్ బుక్ ఏర్పాటు చేసుకొని వచ్చిపోయే వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రైం ఎస్ఐ నిహార్ పాల్గొన్నారు.

అవినీతిపై ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు



వెల్లంకిలో పౌరులకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

ఆనందపురం : అవినీతిపై ఫిర్యాదు చేస్తే అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారని గంభీరంలో గల ఎగుమతుల తనిఖీ ఏజెన్సీ ఇన్‌చార్జి ఏడీ సుధాంశు శేఖర్‌దాస్ చెప్పారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వెల్లంకిలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేఖర్‌దాస్ మాట్లాడుతూ ప్రజలు వివిధ రకాలుగా మోసపోతుండడంతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను చైతన్య పరచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోందన్నారు. పౌరులు సమాజంలో అవినీతిని ప్రోత్సహించరాదన్నారు. సమాజంలోని ప్రతీ పౌరుడికి అవినీతిని ప్రశ్నించే హక్కు ఉందని, అలాంటి ఉల్లంఘనలు జరిగితే సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ వారి చేతుల్లోనే



బహుమతులు అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

తగరపువలస: ప్రతీ విద్యార్థి భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని, తోటివారితో స్నేహబంధం ఏర్పాటు చేసుకుని నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు సాగాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచించారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ టెక్నికల్, సాఫ్ట్, కమ్యూనికేషన్, ప్రాక్టికల్ స్కిల్స్‌పై నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ జయసుమ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో అభివృద్ధికి అనుగుణంగా కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. నగర డీసీపీ జి.నాగన్న మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత భవిష్యత్ కోసం మంచి ఆలోచనలు చేయాలన్నారు. ర్యాగింగ్, డ్రగ్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, స్పీడ్ బైక్ రైడింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. మరో అతిథి దాసరి కిషోర్ మాట్లాడుతూ అంచెలంచెలుగా విద్యార్థులు నిర్దేశించుకున్న శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల వైస్ చైర్మన్ ముత్తంశెట్టి నందీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువులో తామర తూడు తొలగింపు

సంప్రదాయ మత్స్యకారుల శ్రమదానం



చిట్టివలస పెద్ద చెరువులో తామర తూడు తొలగిస్తున్న సంప్రదాయ మత్స్యకారులు

తగరపువలస : భీమిలి రోడ్డులోని చిట్టివలస – చిల్లపేట పెద్ద చెరువులో శనివారం తాటితూరు స్వదేశీ మత్స్య పారిశ్రామిక సంఘానికి చెందిన సంప్రదాయ మత్స్యకారులు తామర తూడు తొలగించారు. చెరువు ఆగ్నేయంలో ప్రక్షాళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సిండిగి గణేష్ మాట్లాడారు. 30 ఏళ్లుగా ఈ చెరువులో మంచినీటి చేపలను పెంచుతూ ఉపాధి పొందుతున్నారన్నారు. గతంలో కేవలం వర్షం కారణంగానే చెరువులో నీరు చేరగా ప్రస్తుతం ఎన్ఆర్ఐ ఆస్పత్రి, సంతపేట, నమ్మివానిపేట తదితర గ్రామాల నుంచి మురుగునీరు చేరుతుందన్నారు. చుట్టుపక్కల గ్రామాల వారు పూజ సామగ్రి తదితర పనికిరాని వస్తువులను చెరువులో కలపడం ద్వారా కొంత భాగం పూడుకుపోయిందన్నారు. జీవీఎంసీ, ఇరిగేషన్, మత్స్యశాఖ సమన్వయంతో చెరువు దక్షిణ భాగంలో పూడిక తీయించి చెరువు గట్టును ఎత్తు చేయించాల్సి ఉందన్నారు. బొగ్గురోడ్డు వైపు వ్యవసాయ భూముల్లోకి చెరువులో అధికంగా ఉన్న నీటిని మళ్లించడానికి కూడా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులో చేపల పెంపకం వల్ల కాలుష్యం తగ్గుతుందన్నారు. చేపల పెంపకం వల్ల చెరువు నుంచి దుర్వాసన రాదని ప్రజలు గ్రహించాలన్నారు. చెరువు బాగు కోసం నిత్యం తమవంతు కృషి చేస్తామని గణేష్ హామీ ఇచ్చారు.

ఆకట్టుకున్న దలేర్ ఖల్సా గ్రూప్ విన్యాసాలు



రెండు చేతులతో నాలుగు బుల్లెట్లను ఆపుతున్న బలశాలి




మేకుల చట్రంపై పడుకుని పొట్టపై ఐస్ దిమ్మ పగలగొట్టించుకుంటున్న కళాకారుడు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు గాంధీ బొమ్మ వీధిలో శ్రీకాణిపాక యూత్ ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం చేశారు. ఇందులో గిన్నీస్ బుక్ రికార్డ్స్ కలిగిన పంజాబీ కళాకారులు దలేర్ ఖల్సా గట్కా గ్రూప్ ప్రదర్శించిన సాహస విన్యాసాలు చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. అందరూ ఆనందంతో కేరింతలు కొట్టారు. కళాకారులు మేకుల చట్రంపై పడుకుని ఉండగా పొట్టపై ఐస్ కేస్‌ను సమ్మెటతో పగులగొట్టారు. మరో కళాకారుడు రెండు చేతులతో నాలుగు బుల్లెట్లను అంగుళం కూడా ముందుకు కదలనీయకుండా నిలువరించాడు. మరో కళాకారుడు కళ్లకు గంతలు కట్టుకుని మరొకరి నెత్తిపై వరుసగా 24 కొబ్బరికాయలు క్షణకాలంలో పగులగొట్టడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అనంతరం నెత్తిపై కోక్ టిన్‌లను ఉంచి కత్తితో ఒకే దెబ్బతో మధ్యలోకి పగులగొట్టారు. ఆయుధాలను ఉపయోగించి చేసిన ప్రదర్శనను తిలకించిన వారు కళ్లప్పగించి ఆనందాశ్చర్యాలకు గురయ్యారు.

సబ్‌వేపై నీటిధారకు చెక్

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జాతీయ రహదారి నుంచి వర్షం నీరు సబ్‌వేపై ధారగా పడకుండా హైవే సిబ్బంది చెక్ పెట్టారు. 'సబ్ వేపై పడుతున్న నీటిధారతో ఇక్కట్లు' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు శనివారం వీరు స్పందించారు. భవిష్యత్‌లో వర్షం నీటి వల్ల సబ్‌వేపై వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టారు. హైవే నుంచి సబ్‌వే వైపు నీరు ప్రవహించే మార్గాల్లో ధారలు రాకుండా పలుచోట్ల పైపులు బిగించారు.



జాతీయ రహదారిపై నిలిచిన నీటికి పైపు వేసిన హైవే సిబ్బంది